సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేయాలి

కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్



అల్లాపూర్ వార్డు కార్యాలయంలో డీసీ రమేష్‌తో సమావేశమైన బండి రమేష్, నాయకులు

కూకట్‌పల్లి: ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించాలని కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్ పేర్కొన్నారు. అల్లాపూర్ డివిజన్‌లో మంగళవారం డీసీ రమేష్, టౌన్‌ప్లానింగ్, ఇతర అధికారులతో వార్డు కార్యాలయంలో ఆయన సమావేశం నిర్వహించారు. ప్రజలు సమస్యలను ప్రస్తావించిన వెంటనే వాటి పరిష్కారానికి కృషి చేయాలని అధికారులకు సూచించారు. నిధులతో పనిలేని సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. నిధులు అవసరమైన చోట కొంత ఆలస్యమైనా పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం స్థానికులు తమ సమస్యలను వారి దృష్టికి తీసుకొచ్చారు.

టౌన్‌ప్లానింగ్ అధికారులపై వెల్లువెత్తిన విమర్శలు..

◆ మాజీ కార్పొరేటర్ సయ్యద్ బాబు మాట్లాడుతూ.. పాండురంగనగర్‌లో 100ఫీట్ల రోడ్ స్థలంలో బిల్డింగ్‌కు అనుమతి ఎలా ఇస్తారని అధికారులను నిలదీశారు. సర్వే నంబర్లు సైతం మార్చి భవనాలకు అనుమతులు ఇవ్వడంపై స్థానికంగా పెద్ద ఎత్తున చర్చ జరిగింది. సఫ్దార్ నగర్ చెరువు నాలాను బస్తీలోకి మలుపు తిప్పడం ద్వారా అక్కడ ఇళ్లల్లోకి వరదనీరు చేరుతోందన్నారు. దీనిపై బండి రమేష్ ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని డీసీకు సూచించారు.

లెక్కకు మించి అంతస్తుల నిర్మాణాలకు అనుమతి ఎలా ఇస్తారు?

◆ కాంగ్రెస్ నాయకురాలు రేష్మ మాట్లాడుతూ.. రాజీవ్‌గాంధీ నగర్‌లో లెక్కకు మించి ఐదు, ఆరు అంతస్తుల అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయని తెలిపారు. వీటికి అనుమతులు ఎవరు ఇచ్చారని ప్రశ్నించారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి పక్కనే చెత్త వేయడంతో భరించలేని దుర్గంధం వ్యాపిస్తోందన్నారు. చెరువులో గుర్రపుడెక్క పెరిగిపోయి దోమలు వ్యాప్తి చెందుతున్నాయని తెలిపారు. ఆయా సమస్యలను పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తూము వేణు, మోయినుద్దీన్, లక్ష్మయ్య, విఠల్ రెడ్డి, జమీర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు కుమార్‌యాదవ్

◆ కమ్యూనిస్టు విద్యార్థి సంఘాలు ప్రభుత్వానికి కొమ్ముకాస్తున్నాయి..

ఆల్విన్‌కాలనీ: రాష్ట్రంలో నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలని మంగళవారం కూకట్‌పల్లి తహసీల్దార్‌కు బీజేవైఎం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుమార్‌యాదవ్ మాట్లాడారు. గ్రూప్–1 విషయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం 1:100 ప్రకారం మెయిన్ ఎగ్జామ్‌కి అభ్యర్థుల అర్హతను పెంచాలన్నారు. అదేవిధంగా గ్రూప్–2, 3 పోస్టులను పెంచి నోటిఫికేషన్ ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ పరీక్షల తేదీలను వాయిదా వేసి మెగా డీఎస్సీని ప్రకటించాలని అన్నారు. పోటీ పరీక్షలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగుల సమస్యలపై ఎమ్మెల్సీ కోదండరాం వెంటనే స్పందించాలని కోరారు. కమ్యూనిస్టు విద్యార్థి సంఘాలు రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగ సమస్యలపై పోరాడాకుండా కాంగ్రెస్ ప్రభుత్వానికి కొమ్ముకాస్తున్నాయని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించి రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగ సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు తీవ్రం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీజేవైఎం అధికార ప్రతినిధి అమర్‌నాథ్ యాదవ్, జిల్లా బీజేవైఎం నాయకులు తిరుపతి రెడ్డి, శ్రీనివాస్‌చారి, హరిప్రసాద్, సాయికుమార్, రాహుల్, సురేష్, పాషా, రాజు, శ్రీను, రాము, భరత్, చందు తదితరులు పాల్గొన్నారు.



కూకట్‌పల్లి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసిన బీజేవైఎం నాయకులు, కుమార్‌యాదవ్

విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయండి: ఎస్ఎఫ్ఐ

బాలానగర్: నీట్, నెట్ పరీక్షలను రద్దు చేసి తిరిగి పరీక్షలు నిర్వహించాలని... ఎన్‌టీఏ సంస్థని రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కూకట్‌పల్లి నియోజకవర్గంలోని శ్రీశ్రీనగర్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు జి. కార్తీక్ మాట్లాడారు. నీట్ పరీక్షలో జరిగిన పేపర్ లీకేజీ అవకతవకలపై సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరిపించి తిరిగి నీట్ పరీక్ష నిర్వహించాలన్నారు. విద్యార్థుల పట్ల ఎన్‌డీఏ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో జులై 4వ తేదీన రాష్ట్ర వ్యాప్త విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

◆ నీట్ పరీక్షలో పేపర్ లీక్‌పై దేశమంతా ఆందోళనలు జరుగుతున్న సమయంలో యుజీసీ-ఎన్ఏటీ పరీక్షను రద్దు చేస్తున్నట్లు ప్రకటించటం విద్యార్థుల భవిష్యత్‌తో చెలగాటం ఆడటమేనని ఆందోళన వ్యక్తం చేశారు. పరీక్ష కుంభకోణానికి బాధ్యత వహిస్తూ వెంటనే ఎన్‌టీఏ చైర్మన్ ప్రదీప్‌కుమార్ జోషి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. జులై 4న జరిగే బంద్‌కు పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు చందు, నితేష్, అరుణ్, చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

డివిజన్‌లో పెండింగ్ పనులను త్వరగా పూర్తిచేయాలి

మూసాపూట కార్పొరేటర్ మహేందర్



సమస్యలను పరిష్కరించాలని అధికారికి వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్

మోతీనగర్: మూసాపేట డివిజన్ పరిధిలోని పీఆర్‌నగర్ వీకర్ సెక్షన్, కబీర్‌నగర్‌లలో నూతన యూజీడీ పనులు, పవర్ బోర్‌వెల్స్ మరమ్మతులు చేయాలని కార్పొరేటర్ కోడిచర్ల మహేందర్ హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ మేనేజర్ ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేశారు. బోనాల పండుగను దృష్టిలో పెట్టుకుని డ్రైనేజీలో వ్యర్థాలు తొలగించి పొంగిపొర్లకుండా చూడాలన్నారు. పెండింగ్‌లో ఉన్న నూతన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను వెంటనే ప్రారంభించాలని కోరారు. పీఆర్‌నగర్ వీకర్ సెక్షన్‌లో డ్రైనేజీ లైన్ లేకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. పవర్ బోర్‌వెల్స్ పూర్తిగా పని చేయని వాటి స్థానంలో నూతన మోటార్లను ఏర్పాటు చేయాలన్నారు. రోడ్లపై పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించాలని కోరారు. సమస్యలన్నింటినీ త్వరగా పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మూసాపేట జనరల్ సెక్రటరీ ఎర్రస్వామి తదితరులు పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణ సేవా సంఘం నూతన కమిటీ ఏర్పాటు

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీ రోడ్ నం.1లో నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో కార్యాలయంలో మంగళవారం నూతన నాయీ బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడుగా పన్నాడి రమేష్, ప్రధాన కార్యదర్శిగా తాటిపాముల వెంకటేశ్వర్లును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు నరసింహులు ముఖ్యఅతిథిగా విచ్చేసి నూతన నాయీ బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు స్వామి, మాజీ ప్రధాన కార్యదర్శి కృష్ణ, చంద్రమౌళి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలతో పనులు త్వరగా పూర్తి చేయాలి



పీజేఆర్‌నగర్‌లో సీసీరోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: ఎల్లమ్మబండ పరిధిలోని పీజేఆర్ నగర్ ఫేజ్-2లో సీసీ రోడ్ల కోసం గతంలో రూ.40లక్షల నిధులు మంజూరయ్యాయి. ప్రస్తుతం నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. వీటిని మంగళవారం ఆల్విన్‌కాలనీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పరిశీలించి మాట్లాడారు. నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలన్నారు. సీసీ రోడ్డుపై వర్షం నీరు నిలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీహెచ్. భాస్కర్, అగ్రవాసు, సంగమేష్, మోజెస్, శ్రీనివాస్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీకాలనీ: కూకట్‌పల్లి రైతు బజార్‌లో కూరగాయల ధరలు కిలో రూపాయల్లో.. 41, వంకాయ 38, బెండకాయ 35, పచ్చిమిర్చి 70, బజ్జీమిర్చి 45, కాకరకాయ 38, బీరకాయ 38, క్యాబేజి 38, బీన్స్ 95, క్యారెట్ 35, గోబిపువ్వు 23, దొండకాయ 18, చిక్కుడుకాయ 75, గోరుచిక్కుడు 50, బీట్‌రూట్ 27, క్యాప్సికం 70, ఆలుగడ్డ 38, కీరా 18, దోసకాయ 23, సొరకాయ 9, పొట్లకాయ 18, కంద 55, ఉల్లిపొరక 75, ఉల్లిగడ్డ 39, మామిడికాయ 15 నుంచి 20, అరటికాయ 8 నుంచి 10, చామగడ్డ 35, ముల్లంగి 4 నుంచి 5, చిలగడ దుంప 40, గుమ్మడికాయ 30, నిమ్మకాయలు 50 నుంచి 60, మునగకాయలు 8 నుంచి 10, బొప్పాయి 40, పుట్టగొడుగులు 40, ఎండుమిర్చి 220, అల్లం 200, వెల్లుల్లి 240, చింతపండు 140, పండుమిర్చి 80, ఉసిరి 60, వేరుశెనగ నూనె 165, పామాయిల్ నూనె 97లుగా ఉన్నాయి.

మరమ్మతులు సరే.. మ్యాన్‌హోల్ నిర్మాణమెప్పుడు?



భరత్‌నగర్ కాలనీలో ఈడబ్ల్యూఎస్‌లో నిర్మాణం చేయని మ్యాన్‌హోల్

మూసాపేట: భరత్‌నగర్ కాలనీలో ఈడబ్ల్యూఎస్‌లో వాటర్‌వర్క్స్ అధికారులు మరమ్మతులు చేసి మ్యాన్‌హోల్ నిర్మాణం చేయటం మరిచారు. ఈ మ్యాన్‌హోల్ మూల మలుపులో ఉండటంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. ఈడబ్ల్యూఎస్ 950లో గేట్‌వాల్వ్ లీకేజీ ఉండటంతో స్థానికుల ఫిర్యాదు మేరకు మరమ్మతులు చేశారు. రెండు నెలలు గడిచినా ఇప్పటికీ మరమ్మతులు చేయకపోవటంతో రోడ్డు పక్కన గుంత అలాగే ఉంది. చిన్నారులు పాఠశాలలకు వెళ్లే సమయంలో అందులో పడిపోయే ప్రమాదం ఉంది. అంతేకాక గుంతలో నీరు నిలిచిపోవడంతో పాటు చెత్తాచెదారం పేరుకుపోయింది. చెత్త కుళ్లి దుర్వాసన వెదజల్లుతోంది. నీరు నిలిచిపోవటంతో దోమలు వృద్ధి చెందుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. అధికారులకు విన్నవించినా తమ గోడును పట్టించుకోవటం లేదని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మ్యాన్‌హోల్ నిర్మాణం చేయాలని కోరుతున్నారు.

నిరుద్యోగ సమస్యలపై సీఎం స్పందించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: నిరుద్యోగ సమస్యపై సీఎం రేవంత్ రెడ్డి స్పందించాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జాతీయ నాయకులు నాగేశ్వర్ రావు మాట్లాడుతూ.. నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం పట్ల ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య తీవ్ర రూపం దాల్చక ముందే పరిష్కారం కోసం ప్రణాళిక రూపొందించి జాబ్ కేలండర్ విడు దల చేయాలన్నారు. టెట్ అభ్యర్థులకు చదువుకునే సమయం లేనందున డీఎస్సీ పరీక్షను వాయిదా వేయాలన్నారు. ఈ సమావేశంలో సుమంత్, స్వాతి, రుక్మత్ పాషా, అంజి, ప్రశాంత్, సతీష్, కాంత్రి, కోటేశ్వర్, శ్రీవాణి, సౌజన్య, భవాని, రామ్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ మహిళ విశ్వవిద్యాలయంలో పార్టుటైం అధ్యాపక ఉద్యోగాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తెలుగు, ఉర్దూ, ఇంగ్లిష్, కామర్స్, జంతుశాస్త్రం, ఫుడ్ సైన్స్, కంప్యూటర్ సైన్స్, బీబీఏ, ఫుడ్ అండ్ న్యూట్రీషియన్, జనటిక్స్, కెమిస్ట్రీ, మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ సబ్జెక్టులను బోధించేందుకు ఈ నెల 8వరకు దరఖాస్తు చేసుకోవచ్చాన్నారు. సర్టిఫికెట్లను నేరుగా అకాడమిక్ డైరెక్టర్ కార్యాలయంలో సమర్పించాలన్నారు.

డివిజన్లను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తా



మేయర్ కొలను నీలాగోపాల్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న కాలనీల ప్రతినిధులు

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్‌లోని అన్ని డివిజన్లను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని మేయర్ కొలను నీలాగోపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం ప్రగతినగర్‌లోని రెండో డివిజన్ కార్పొరేటర్ చిట్ల దివాకర్ ఆధ్వర్యంలో ఎన్ఆర్ఐ, శ్రీరంగాస్ నందనం, శ్రీ నిలయం, కాలనీల ప్రజలకు మేయర్‌ను కలిశారు. ఈ సందర్భంగా తమ తమ కాలనీల్లో ఎదుర్కొంటున్న సమస్యలను ఆమెకు వివరించారు. కాలనీల్లో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉన్న వెంటనే తమ దృష్టికి తీసుకువస్తే వేగవంతంగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. సీసీరోడ్లు, డ్రైనేజీ, వీధి లైట్లు, పార్కుల అభివృద్ధి లాంటి పనులపై పూర్తి స్థాయిలో దృష్టి సారించామన్నారు. ఈ సందర్భంగా కాలనీల ప్రజలు పలు సమస్యలపై మేయర్‌కు వినతి పత్రం అందజేశారు.

దళిత ఎస్ఐకి రాష్ట్ర డీజీపీ అండగా ఉండాలి

ఉస్మానియా యూనివర్సిటీ: భద్రాది కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట ఎస్ఐ శ్రీరాముల శ్రీనివాస్‌కు రాష్ట్ర డీజీపీ, ప్రభుత్వం అండగా ఉండాలని ఆల్ మాల స్టూడెంట్స్ అసోసియేషన్ (అంసా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాలల పొలిటికల్ జేఏసీ చైర్మన్ డా.మంచాల లింగస్వామి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఐ జితేందర్ రెడ్డి, నలుగురు కానిస్టేబుళ్ల వేధింపులతో ఎస్ఐ శ్రీనివాస్ ఆత్మహత్యాత్నానికి పాల్పడినట్లు పేర్కొన్నారు. వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డీజీపీని కోరారు.

నీట్ పరీక్షను రద్దు చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ: నీట్ పరీక్ష విధానాన్ని రద్దు చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాజుల లింగంగౌడ్ మంగళవారం డిమాండ్ చేశారు. నీట్ అక్రమాల పై సమగ్ర విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. జాతీయ స్థాయిలో కాకుండా రాష్ట్రాల వారీగా పాత పద్ధతిలో హెల్త్ యూనివర్సిటీల పర్యవేక్షణలో ప్రవేశ పరీక్షను నిర్వహించాలన్నారు. నీట్ ఫలితాలు విడుదలై 28 రోజులైన కేంద్ర ప్రభుత్వం ఇంత వరకు ఎవరి పై చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరితో 24 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్ అంధకారమైందని విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను పదవి నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు.

బీజేపీ అధ్యక్షుడిగా రాంచందర్ రావుకు అవకాశం ఇవ్వాలి

ఉస్మానియా యూనివర్సిటీ: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్సీ, రాంచందర్ రావు అవకాశం ఇవ్వాలని ఓయూ పూర్వ విద్యార్థులు కోరారు. విద్యార్థి దశ నుంచి రాజకీయాల్లో క్రియాశీలక పాత్ర పోషించిన ఆయన రాష్ట్ర నాయకుడు, జంటనగరాల అధ్యక్షుడిగా పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఇతర వర్గాలను సమన్వయం చేసుకునే స్వభావం గల రాంచందర్ రావును బీజేపీ అగ్రనాయకులు గుర్తించి అధ్యక్షుడిగా నియమించాలన్నారు.

పార్కులో ఆకతాయిల ఆగడాలను అరికట్టండి



భరత్‌నగర్‌కాలనీలోని ఎంఐజీ వద్ద పర్యటిస్తున్న కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్

మూసాపేట: భరత్‌నగర్‌కాలనీ ఎంఐజీ పార్కును ఏఈ పవన్, స్థానికులతో కలిసి మంగళవారం కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ సందర్శించారు. ఈ సందర్భంగా రాత్రిపూట ఆకతాయిలు పార్కులో తాగి ఇబ్బందులు కలిగిస్తున్నారని స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో కార్పొరేటర్ వెంటనే ఇన్‌స్పెక్టర్ పురుషోత్తంరెడ్డికి రాత్రిపూట కూడా గస్తీ పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో హనుమంతరావు, సాంబశివరెడ్డి, వినయ్, ఉమావతి గౌడ్, జ్యోతి గౌడ్, పుతిలి బేగం తదితరులు పాల్గొన్నారు.

శానిటేషన్, డ్రైనేజీ పనులను త్వరగా పూర్తిచేయాలి

అధికారులకు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదేశం



కూకట్‌పల్లిలోని హైటెన్షన్ రోడ్డు వద్ద డ్రైనేజీ, రోడ్ల పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి హైటెన్షన్ రోడ్డు వద్ద డ్రైనేజీ, రోడ్ల పనులను మంగళవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వచ్చే వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని సిబ్బంది శానిటేషన్, డ్రైనేజీ పనులను పూర్తిచేయాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం కాలనీల ప్రతినిధుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. డివిజన్‌లోని చెరువులలో గుర్రపుడెక్క ఎక్కువగా ఉండటంతో దోమల సమస్య ఎక్కువ అవుతోందన్నారు. అదే విధంగా ఎంటమాలజీ విభాగంలో ఎక్కువ సిబ్బంది హాజరవుతున్నట్లు చూపెడుతూ పనులు చేయటంలో తక్కువ సిబ్బంది హాజరవుతున్నారని తన దృష్టికి వచ్చిందన్నారు.

◆ ఏదో ఒకరోజు తనిఖీలు చేసి వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అధికారులు రానున్న ఆషాఢ బోనాలను దృష్టిలో ఉంచుకొని దేవాలయాల వద్ద డ్రైనేజీ పనులు, రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయాలని కోరారు. సమస్యలు ఎన్ని ఉన్నా వాటికి కావాల్సిన నిధుల కోసం ప్రణాళికను సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. జిల్లా మంత్రులను కలిసి నిధులు తీసుకొస్తామన్నారు. ఆలస్యం చేయకుండా పనులను పూర్తి చేయాలని అధికారులను కోరారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, జీహెచ్ఎంసీ అధికారులు, వాటర్‌వర్క్స్ అధికారులు, ఎలక్ట్రికల్ అధికారులు, డివిజన్ అధ్యక్షులు సంతోష్, ప్రభాకర్, బొట్టు విష్ణు తదితరులు పాల్గొన్నారు.



అధికారులకు సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే

వినికిడి యంత్ర పరికరాల అందజేత



వినికిడి పరికరాలను అందజేసిన ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ తదితరులు

ఆల్విన్‌కాలనీ: ఆస్‌బెస్టాస్ కాలనీకి చెందిన ధనుంజయ్‌రావు కుమారుడు బేవర సుబ్రహ్మణేశ్వర్‌రావు, కుమార్తె దేవర మన్విత లకు వినికిడి లోపం ఉంది. వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు మంజూరైన రూ.1.6లక్షల విలువ చేసే వినికిడి యంత్ర పరికరాలను ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ మంగళవారం అందజేశారు.

ఏసీపీ లక్ష్మీనారాయణకు వీడ్కోలు

కూకట్‌పల్లి: జీహెచ్ఎంసీ కూకట్‌పల్లి జోన్ కార్యాలయంలో ఏసీపీగా ఉద్యోగ విరమణ పొందిన లక్ష్మీనారాయణకు మంగళవారం అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది వీడ్కోలు పలికారు. ఎస్ఈ చిన్నారెడ్డి, టీపీఎస్ సోమేష్‌కుమార్ ఆయనను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. అధికారులు, ఉద్యోగులు మంచి పనితీరుతో ప్రజల అభిమానాన్ని పొందే విధంగా పనిచేయాలని కోరారు.

పదేళ్లలో బీఆర్ఎస్ చేయలేనిది... కాంగ్రెస్ ఆరు నెలల్లో చేసింది

టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం



కూకట్‌పల్లి: విపక్షాలు చేస్తున్న విమర్శలకు చెక్ పెట్టేలా కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త వ్యూహాలతో.. సరికొత్త ప్రణాళికలతో ముందుకు వెళ్తోందని టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ... హైదరాబాద్‌లో రహదారుల విస్తరణ, ఇతర అవసరాలకు రక్షణ శాఖ భూములు 2500ఎకరాలను తెలంగాణ ప్రభుత్వానికి బదలాయించడం హర్షణీయమన్నారు. రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేసిన వెంటనే తెలంగాణ ప్రభుత్వానికి భూములను అప్పగించేందుకు కేంద్ర రక్షణ శాఖ ఆమోదం తెలుపుతూ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఎలివేటెడ్ కారిడార్ల కోసం రక్షణ శాఖ భూములను సాధించారన్నారు. కంటోన్మెంట్‌ను మిలటరీ పరిధి నుంచి మినహాయింపు తెచ్చారని పేర్కొన్నారు. పదేళ్లలో బీఆర్ఎస్ చేయలేనిది... ఆరు నెలల్లో కాంగ్రెస్ చేసిందని అన్నారు.

ఉద్యోగ విరమణ



గురాచారి దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గురాచారి మంగళవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి భాషా పండితులు, ఉపాధ్యాయులు హాజరై రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ తెలంగాణ జిల్లా పక్షాన శాలువా, పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా శాఖ పక్షాన జిల్లా అధ్యక్షులు వీఎస్ఎస్ శర్మ, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు స్వప్న, సీనియర్ భాషా పండితులు చంద్రశేఖర్, కృష్ణగౌడ్, రామ్మోహన్, సుజాత, సాయిగీతిక, శ్వేత పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పుష్పయాగం



మూసాపేట: కూకట్‌పల్లి ఐడీఎల్ చెరువు సమీపంలోని రంగనాయకస్వామి ఆలయంలో మంగళవారం పుష్పయాగం నిర్వహించారు. ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గరుడ ప్రసాద పంపిణీ, చక్రతీర్థం, పుష్పయాగం వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం తులసీ దళార్చన నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఆర్థిక, ఆరోగ్య సమస్యలతో ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య



కేపీహెచ్‌బీకాలనీ: ఆర్థిక సమస్యలు, ఆరోగ్య సమస్యలు తాళలేక ఓ యువకుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కోతభాను శంకర్ వెంకటసాయిరామ్ (28) కేపీహెచ్‌బీకాలనీలోని ఎల్ఐజీలో అతని స్నేహితులతో కలిసి నివసిస్తున్నాడు. సోమవారం రాత్రి రూమ్ వచ్చిన అతడి స్నేహితుడు తలుపులు కొట్టినా స్పందించకపోవడంతో వెంటనే కేపీహెచ్‌బీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు వచ్చి చూడగా సాయిరామ్ ఉరేసుకొని కనిపించాడు. మంగళవారం అతడి సోదరి బండారుపల్లి ప్రసూనరాణి ఆర్థిక, ఆరోగ్య సమస్యలు ఉండటంతో ఆత్మహత్య చేసుకున్నట్లు ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అనాథ వృద్ధురాలు మృతి



రాజేశ్వరి వృద్ధాశ్రమంలో మృతి చెందిన వృద్ధురాలు

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి సర్కిల్ ఆల్విన్‌కాలనీ సాయినగర్‌లోని శ్రీరాజేశ్వరి వృద్ధాశ్రమంలో మతిస్థిమితం లేని ఓ అనాథ వృద్ధురాలు మంగళవారం అనారోగ్యంతో మృతి చెందింది. ఐదు నెలల క్రితం జగద్గిరిగుట్ట పోలీసులు మతిస్థిమితంలేని వృద్ధురాలిని తీసుకువచ్చి ఆశ్రమంలో చేర్పించారు. అనారోగ్యంతో మృతి చెందడంతో ఆశ్రమ నిర్వాహకురాలు రాజేశ్వరి వృద్ధురాలికి ఖర్మకాండలు చేసి ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.